# అతకని బ్రతుకులు

ఇసుకను పాదాలతో తన్నుకుంటూ నడుస్తున్న అతను హఠాత్తుగా ఆగిపోయాడు. స్నేహితురాళ్ళతో కబుర్లు చెప్తూ కూర్చున్న రమణిని చూడగానే ఆశ్చర్యానందాలతో నిండిపోయిందతని మనసు.

'రమా!" అప్రయత్నంగానే పిలిచాడు. ఆశ్చర్యంగా తలతిప్పి చూసిన రమణి నెమ్మదిగా లేచి అతని దగ్గరకు వచ్చింది.

'కులాసాగా వున్నారా?' అతి సహజంగా ప్రశ్నించింది – రమణి.

పరీక్షగా ఆమె మొహంలోకి చూసాడు ప్రసాద్. నిర్మలమైన ఆ వదనంలో ఏభావాన్నీ చదవలేకపోయాడు, కాస్త చిక్కిపోయినట్టున్నా అతి నిరాడంబరంగా వున్న రమణిలో ఒక హుందాతనం కన్పిస్తూంది.

ఆలోచనలనుండి తేరుకుంటూ "చాలరోజుల తర్వాత చూసాను. నువ్విక్కడికెలా వచ్చావు?" అన్నాడు.

'బి.ఎస్.సి. స్టూడెంట్స్‌తో వచ్చాం! వాళ్లంతా పిక్చర్‌కి వెళ్తే మేమిలా బీచికి వచ్చాం. వాళ్ళు నాకోసం వెయిట్ చేస్తున్నారు. వెళ్తానూ." అంటూ వెళ్ళిపోయింది రమణి.

ప్రసాద్ హృదయం బాధగా మూల్గింది. మరో క్షణంకూడా అక్కడ వుండాలనిపించ లేదతనికి. భారంగా అడుగులువేస్తూ హోటల్ వైపు దారితీసాడు.

"ఏమీ సంబంధంలేని పరాయి వ్యక్తితో మాట్లాడినట్టే అతి ముక్తసరిగా మాట్లాడి వెళ్ళిపోయింది. ఏం మనిషి?" ఆ ఆలోచనలతోనే ఇల్లు చేరుకున్నాడు ప్రసాద్. ఎంతగా వద్దనుకున్నా మనసు గతంవైపే పోతూంది.

"వెరీసారీ డియర్! పిక్చర్‌కని రెడీ అయి చూసివుంటావు నాకోసం అవునా? ఎక్స్క్యూజ్‌మి ఫర్ డిస్సప్పాయింటింగ్ యు." లోపలికి అడుగు పెడుతూనే క్షమాపణలు చెప్పుకున్నాడు ప్రసాదు.

"బావుంది! నేనేం పసిపాపాయినా ఇంతచిన్న దానికి బాధపడడానికి?" చిన్నగా నవ్వేసి అతనికి కాఫీ టిఫినూ తీసుకురావడానికి లోపలకు నడిచింది రమణి.

ఆమె తిరిగి వచ్చేసరికి జాజిపూల పొట్లం విప్పుతున్నాడతను.

"ముందు కాఫీ తీసుకోండి. చల్లారిపోతుంది" పొట్లం తను అందుకుంటూ అంది రమణి.

"అదికాదు రమా తీరానేను వెళ్ళేసరికి విజయ ఇంకా కాలేజి నుండి రాలేదు. గేమ్స్ వున్నాయట. సరే! వాళ్ళ నాన్నగారితో మాట్లాడుతూ కూర్చున్నాను అయిదున్నర కొచ్చిందా అమ్మాయి. ట్యూషన్ ముగించు కొచ్చేసరికి ఈ టైమయింది" టిఫిన్ తినడం పూర్తిచేశాడు ప్రసాదు. చెవులమీదగా జుట్టుతీసి మెడపైకి వేసుకున్న ముడిలో అందంగా పూవుల నమర్చుకుంటున్న భార్యవైపు చూస్తూ ఎందుకో గర్వంగా ఫీల్ అయ్యాడు.

'అలా వాకింగ్ పోదామా రమా?" అడిగాడు వున్నట్టుండి.

"అయితే చీర మార్చుకొస్తాను!" అంటూ గదిలోకి వెళ్ళింది రమణి.

టేబులుమీద పేపరు అందుకోబోతుంటే గులాబిరంగు, కాగితాలు క్రిందపడ్డాయి. అనుకోకుండానే తీసిచూసాడు ప్రసాదు.

డియర్ రమణీ!

నువ్వు ఉత్తరంరాసి ఎన్నాళ్ళయిందో తెల్సా? ఈ చల్లని వెన్నెట్లో సన్నజాజులు పరిమళం మధ్యకూర్చున్నా నీమీద కోపం వలన నా మనసుకు చల్లగా అనిపించటంలేదు.

చటుక్కున ఆఖర్న చూసాడు ప్రసాదు.

'యువర్స్

శ్రీధర్.

అని వుంది, ప్రసాదు మొహం ఎఱ్ఱబడింది ఒక విధమైన అసూయతో మనసు కుతకుతలాడింది. అంతకు ముందున్న ఉత్సాహమంతా చచ్చిపోయింది. విసురుగా కుర్చీలో నుండి లేచి పచార్లు చేయడం మొదలు పెట్టాడు.

"పదండి పోదాం" అంటూ వచ్చింది రమణి. పాము కుబుసం వంటి తెల్లని చీరలో, వెన్నెల కన్న మెత్తని బ్లౌజుతో అందంగా వున్న రమణిని చూస్తుంటే మనసు చల్లబడకపోగా మరికాస్త వేడెక్కింది.

ఆమె మాట విననట్టే "ఎవరా శ్రీధర్?" అన్నాడు కళ్ళతోనే ఆ కాగితాలవైపు చూపిస్తూ, ఎంతలేదన్నా కటుత్వం తొంగి చూసిందతని గొంతులో.

కాని అదేమి గమనించనే లేదు రమణి. "మన పెళ్ళిలో ఇంట్రొడ్యూస్ చేయలేదుటండి మీకు? నాకు కెమెరా కూడా చదివించాడే... అతను" అంది.

"ఓహో! లెటర్సు రాసుకునేంత ఫ్రండ్షిప్పా మీ యిద్దరిదీ?"

ఈ ప్రశ్నలో వినబడ్డవ్యంగ్యానికి విసురుగా తలెత్తిన రమణి "ఏం అందులో తప్పేముంది? వింతేముంది? మీ భార్య ఘోషా స్త్రీలా వుండాలనా మీ ఉద్దేశం?' కొంత తీవ్రంగానే అడిగింది.

ప్రసాదు కొద్దిగా తమాయించుకున్నాడు. "అని కాదనుకో! కాని ఎంత కాలేజీల్లో చదివినా ఏదో మాటలవరకే వుంటుంది కదా లెటర్స్ రాసేంత స్నేహమా మీది?"

"అతను ఒక్క కాలేజీ మేటే కాదు నాకు. వాళ్లు మాకు ఫ్యామిలీ ఫ్రండ్స్. ఆ వూరు వదిలినప్పటి నుండి అంటే ఇంచుమించు మూడేళ్లనుండి ఉత్తర ప్రత్యుత్తరాలు సాగుతూనే ఉన్నాయి మా మధ్య' రమణి అహం బాగా గాయపడిందని రోషంతో అదురుతున్న ఆమె పెదవులే చెప్తున్నాయి.

ఎంత చదువుకున్నదయినా ఆ నిర్లక్ష్యం, అహంకారం చూచి ఒళ్లు మండింది ప్రసాదుకు.

"అప్పుడయితే సరే - కాని పెళ్లయిన ఓ స్త్రీకి ఇలా లెటర్ రాయడం మర్యాద కాదని తెలీదా అతనికి? అందులోనూ 'డియర్ రమణీ... వెన్నెలా సన్నజాజులూ యువర్స్ శ్రీధర్ అంటూ ఏమిటా రాతలు? ఎంత విశాలంగా ఆలోచించే వాళ్లయినా అపార్థం చేసుకోవడానికి ఆస్కారం లేదంటావా?" కొంత హేళనగానూ కొంత తీక్షణంగానూ అడిగాడు.

"అంటే... అంటే "మీ యిద్దరి ఫ్రండ్షిప్‌నూ శంకిస్తున్నాను" అని ఇండైరెక్ట్‌గా చెప్పడమేగా అది?" గులాబీలా ఎఱ్ఱబడిన ముఖంతో చిరు చెమటలు పోస్తుండగా ఆవేశంగా అన్న రమణి గొంతు జీరబోయింది.

"నా ఉద్దేశం .దికాదు"... ప్రసాదు ఏమో చెప్పబోయేంతలో అడ్డుకుంటూ,

"మీరేం నాకు చెప్పనక్కర్లేదు. అతను రాసిన దాంట్లో అసభ్యత నాకెక్కడా కనబడలేదు. అదీ కాక పెళ్లయితే స్నేహాలు మానేయాలని నేననుకోను లేదు!' తీవ్రంగా అని విసురుగా వెనక్కి తిరిగి మేడమీదకి వెళ్లిపోయింది రమణి.

ఒకర్నొకరు పలుకరించకుండా ముభావంగానే గడిపేసారు ఆ రాత్రి.

మర్నాడు నిద్రలేవగానే "రమా! ఇవాళ తప్పకుండా పిక్చర్‌కి పోదాం... రెడీగా వుంటావుకదూ?

ఏమీ జరగనట్టే అన్నాడు ప్రసాదు.

వాజులో కొత్త పువ్వులుంచుతున్న రమణి మౌనంగానే తలవూపి వెళ్లిపోయింది లోపలికి.

ఆఫీసుకు వెళ్లేముందుకూడా మరోసారి హెచ్చరించి వెళ్లాడు ప్రసాదు.

అతనెంత మామూలుగా ఉండాలని ప్రయత్నిస్తున్నా రమణి హృదయం మెత్తబడలేదు. నిన్నటి అతగాడి మాటలు గుర్తుకొస్తే పుండురేగినట్టు బాధ కలుగుతూంది.

'ఏం మగవాళ్లు? తమతో సమానంగా చదువుకున్న ఉద్యోగం చేస్తున్న స్త్రీని పరదా వెనకే దాచాలని అనుకుంటారు. తన భార్య అనగానే మరో మగవాడిని కన్నెత్తి చూసినా అతని నీడసోకినా భరించలేని అసూయ ఒక్క భారతీయుడికే స్వంతం!.'

శ్రీధర్ కొత్తలో తనని చెల్లెమ్మా అని పిలిచేవాడు. అలాగే రాసేవాడుకూడా! కానీ తనే

మొండిగా వాదించింది. 'ఏం బంధుత్వం ఎందుకు కలుపుకోవాలి? స్నేహితులం స్నేహితులుగానే వుందాం' అని. స్నేహం పాలలా తెల్లనిదీ,! వెన్నెలలా చల్లనిదీ కాని ఆ స్వచ్ఛత, చల్లదనం, ఆ స్నేహం ఇరువురి స్త్రీల మధ్య పరిమిత మయినప్పుడేనట అని ఓ రచయిత్రి రాసింది. ఒక అబ్బాయి అమ్మాయీ స్నేహం చేసి ఆ స్నేహం ప్రేమలోనికి దిగకుండా అలా స్నేహితులుగానే వుండిపోతే ఎవరు సహిస్తారు? నమ్మలేరు?!! ఏవేవో ఆలోచనలతో ఎప్పుడో నిద్రలోనికి జారింది రమణి.

సినిమాలోకూడా ఎక్కువగా మాట్లాడలేదు రమణి భర్తతో. ఇంటికివచ్చి భోజనాలు పూర్తయ్యాక డాబామీద పరుపులు వేసి, వరండాలో టేబులులైటు వేసుకొని రాసుకుంటూ కూర్చుంది.

“పదకొండవ్వొస్తుంది. వచ్చి పడుకోరాదు రమా? ప్రసాదు అడిగాడు.

“నాకు నిద్రరావడంలేదు.” ముక్తసరిగా అంది. “ఏమిటంత అర్జంటుగా రాసేది”? కాస్త విసుగ్గా అడిగాడు.

“శ్రీధర్‌కు రిప్లైరాస్తున్నా!” ధృఢంగా అంది. ఆరిపోతున్న మంట రాజుకున్నట్టయింది ప్రసాదుకు. అతను ఊహించలేదిలా జరుగుతుందని. తనకిష్టం లేదని తెలిసాక ఆమె ఉత్తరాలు మానేస్తుందనకున్నాడు. కానీ ఇప్పటికిప్పుడు శ్రద్ధగారాస్తున్న రమణిని చూస్తుంటే కోపం వచ్చిందతనికి. వస్తున్న నిద్ర దూరంగా పారిపోగా నక్షత్రాలు లెక్కపెడుతూ మనసులోనే కుతకుతలాడిపోతూ పడుకున్నాడు.

ఇంచుమించు గంట తర్వాత ఉత్తరం ముగిసింది. లైటార్పి తన మంచంమీదకెళ్లి పడుకుంది రమణి!

'ఎనిమిది పేజీలు రాసిందన్న మాట! ఏమున్నాయంత విశేషాలు?' కోపంగా మనసులోనే అనుకుంటూ కళ్లు గట్టిగా మూసుకుని పడుకున్నాడు ప్రసాదు.

“ఏరా ఉత్తరం పోస్టు చేసావా?” ప్రశ్నించింది రమణి.

గంగడు తటపటాయిస్తూ నిలబడిపోయాడు, బిక్క మొహంతో.

“ఏం అలానీళ్లు నములుతావేం”? గద్దించింది. “మరి... మరండి అయ్యగారు తను పోస్టు చేస్తానని తీసుకున్నారు!” భయం భయంగా చెప్పాడు.

మాన్పడిపోయింది రమణి 'ఏం మనిషి? అంత అనుమానమా? సభ్యతకూడా మరచిపోయాడన్న మాట!' అనుకుంటూ. కొద్ది క్షణాల తర్వాత తేరుకుంటూ,

“కవరు తీసుకొని... ఏం చేసారు?” అనడిగింది.

రంగడు ఏదో చెప్పబోయి ఆగిపోయాడు సంకోచంతో.

“ఫర్వాలేదు. భయంలేదులే! చెప్పు.”

“మరే... చాకుతో తెరచి చదివారండీ!” తన తప్పేమీ లేదన్నట్టు తలవంచుకున్నాడు.

“సరే! నువ్వెళ్లు!” అంటూ వాణ్ణి పంపేసింది.

"లెటర్ పోస్ట్ చేశారా" అతను టిఫిన్ తినడం అయ్యాక చాలా కూల్‌గా అడిగింది రమణి సాయంత్రం.

ఒక క్షణంలో ప్రసాదు ముఖంలో రంగులు మారాయి. అంతలో నిలద్రొక్కుకుంటూ "ఏం లెటరు?" అన్నాడు తెలియనట్టు.

చేసిన తప్పుపనిని కప్పిపుచ్చాలని చూస్తున్న అతని నటన ఆమెకు అసహ్యమని పించింది.

"చదివి చూసినా ఏం లెటరని తెలియలేదా? తెలుగులోనే వుందిగా... నిజంగా మీరింత అసభ్యంగా ప్రవర్తిస్తారని ఊహించలేదు!" ఆవేశం అణచుకుంటూ అంది.

ప్రసాదుకు కూడా నిగ్రహం సడలిపోయింది.

"అవును. తీసి చదివాను ఏం నువ్వు భర్తమీద పితూరీలు రాయటం సభ్యతేగాని నేను చేసింది మాత్రం తప్పు అంతేనా?" తీక్షణంగా చూసాడు.

"ఓహో! మీమీద ఏం రాశానో అనా అనుమానం? అందులో చాడీలు చెప్పడమే ముంది? జరిగిన విషయం మీరన్న మాటలు రాసాను. చదువుకున్న వారై వుండి పైగా చేసిన దాన్ని సమర్థించుకో జూస్తున్నారు. ఛ ఛ" ... అసహనంగా వెనక్కి తిరిగింది రమణి!

ఆ విసురుకు ప్రసాదులోని పురుషత్వం భగ్గుమంది. "మీ యిద్దరి నడుమ ఎంతటి స్నేహ సాన్నిహిత్యాలున్నాయో నాకు తెలియదుగానీ మీ మధ్య నా విషయం అనవసరం! నేనుకాదు సమర్థించుకుంటున్నది నువ్వు! స్నేహం పేరుపెట్టి నన్ను మభ్యపెట్టాలని ప్రయత్నిస్తున్నది నువ్వు!" కఠినంగా అన్నాడు.

గిర్రున తిరిగి అతని దగ్గరగా వచ్చింది రమణి. "ఏమంటున్నారు? స్నేహం పేరుతో మభ్య పెడుతున్నానా ఛీ.. ఎంత సంకుచితంగా ఆలోచించగలరు మీరు? ట్యూషన్ సాకుతో విజయను కలుసుకుంటున్నారని అనుకోవాలన్నమాట! స్నేహితుల మధ్య దాపరికాలుండవు. నా విషయాలన్నీ అతనికి రాస్తాను నేను. అందులో మీరుగానీ మరొకరు గాని కల్పించుకోనవసరంలేదు"... రమణి ఇంకా ఏదో చెప్పబోతూండగా అందుకున్నాడు ప్రసాదు.

"ఈ విధమైన ఉత్తర ప్రత్యుత్తరాలను నేను సహించను! ఇప్పుడే చెప్తున్నా గుర్తుంచుకో!" ఆజ్ఞాపిస్తున్నట్టుంది అతని స్వరం!

రమణి తిరస్కారంగా నవ్వింది. "ఎప్పుడైతే మీ అనుమానాలను వెలిబుచ్చారో అప్పుడే నామీద అధికారం వదులుకున్నారు. ఆప్యాయతతో అధికారం స్వీకరించవచ్చుగానీ అనుమానాలతో కాదు. ఎంతో విశాల హృదయులని నమ్మి మీ జీవితంలో ప్రవేశించాను. స్నేహం పేరుతో మభ్యపెడుతున్నానా మిమ్మల్ని? ఆ మాట అన్న క్షణంలోనే మన ఇరువురి మనసులూ దూరమయ్యాయి. మనసులు కలవని, సహృదయత సానుభూతి లేని సంసారం నా కక్కర్లేదు. మీరు ఒక విషయం గుర్తుంచుకోండి! నేను శ్రీధర్ని గనుక మరో దృక్పథంతో చూసివుంటే అది దాచుకొని మిమ్మల్ని చేసుకునేంత సంకుచిత వాతావరణంలో పెరగలేదు నేను. నా మనసును నిర్భయంగా వెలిబుచ్చగల స్వతంత్రం మా అమ్మా నాన్నలు నాకిచ్చారు!" ఆవేశంగా మాట్లాడ్డం వలన అలసిపోయింది రమణి. మౌనంగా గదిలోనికి వెళ్ళి సూట్‌కేసులో తన బట్టలు సర్దుకోసాగింది.

ప్రసాదు నిర్ఘాంతపోయాడు. రమణి ఇంత స్వతంత్ర భావాలు గల వ్యక్తని అతననుకోలేదు. నొచ్చుకొని ఆ స్నేహం వదిలేస్తుందనుకున్నాడే గాని ఇలా తనతోనే తెగతెంపులు చేసుకుంటుందనుకోలేదు.

నెమ్మదిగా గదిలోనికి వెళ్ళాడు. అద్దంలో నుంచి రమణి మొహం కనిపిస్తూంది. ఆమె చెక్కిళ్ళు కన్నీటితో తడిసి వున్నాయి. పంటితో క్రింది పెదవిని నొక్కిపెట్టి నిగ్రహంగా వుండడానికి ప్రయత్నిస్తూంది.

ఏం మాట్లాడాలో తోచలేదు ప్రసాదుకు. బ్రతిమలాడడానికి అహం అడ్డొచ్చింది.

"అయితే వెళ్ళిపోవడానికే నిశ్చయించుకున్నావన్న మాట?"

భర్తగొంతు విని చటుక్కున కళ్ళు తుడుచుకుంది రమణి. "నా వ్యక్తిత్వాన్ని గౌరవించలేని వాళ్ళను నేను ప్రేమించలేను క్షమించండి!" సూట్‌కేస్ తీసుకొని నెమ్మదిగా బయటకు నడిచింది ఆమె.

X X X

సిగరెట్ చివరవరకూ కాలి చెయ్యి చురుక్కుమంది. ఆలోచనలనుండి తేరుకొని సిగరేట్ విసిరేసి లేచి బయటకు వచ్చాడు ప్రసాదు.

రమణి వెళ్ళి రెండేళ్లు కావస్తూంది. డిమానుస్ట్రేటరుగా చేరిందని విన్నాడు. ఇన్నాళ్ల తర్వాత ఈ రోజు ఆవిడను చూసాడు.

ప్రసాదు చిన్నగా నిట్టూర్చాడు. ఇందులో తెప్పెవరిది? ఎవరిదీలేదు నిజానికి! ఆమె చాల స్వతంత్ర భావాలుగల స్త్రీ! ఇంతటి స్వేచ్ఛను సహించలేడుతను! అందుచేత ఇద్దరి బ్రతుకు బాటలు చీలిపోయాయి. ప్రసాదు గుండె బరువెక్కింది.

"మురళి" మాస పత్రిక

తేది : జూన్, 1969.